


## మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం | 08 మార్చి, 2026 | పేజీలు :08




## పకడ్బందీగా ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/బెల్లంపల్లి/నస్పూర్ :** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శనివారం బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 17, 31, 32, 33 వార్డులలో కొనసాగుతున్న ప్రగతి ప్రణాళిక పనులను మున్సిపల్ కమిషనర్ సంపత్, చైర్ పర్సన్ దావ స్వాతి, వైస్ చైర్ పర్సన్ సత్యనారాయణలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12వ తేదీ వరకు 99 రోజుల పాటు సాగే ఈ కార్యచరణను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను కోరారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని, వేసవి దృష్ట్యా తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. 17వ వార్డులోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మందుల నిల్వలు, వైద్య సేవలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అనంతరం రాంనగర్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పనులను పరిశీలించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని టవర్ వద్ద నిత్య జనగనమణ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ మంత్రి జీవన్ రెడ్డిలు వేర్వేరుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, నాయకులు గోళి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



# ఉపాధి కూలీలకు ఫొటోల తిప్పలు!

### అమలులోకి రెండు ఫొటోలు

### సిగ్నల్ సమస్యతో మరింత ఆలస్యం

### ఫీల్డ్ అసిస్టెంట్లకు తప్పని తిప్పలు

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** ఉపాధి హామీ పథకంలో కూలీల హాజరుకు సంబంధించిన అవకతవకలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలకు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ ఎం ఎం స్)యాప్ ద్వారా హాజరను తప్పనిసరి చేసింది. ఇందులో భాగంగా పని ప్రదేశానికి వచ్చిన ఒక్కో కూలిని వ్యక్తిగతంగా ఫొటో తీసి నేషనల్ మాస్టర్ మేనేజ్మెంట్ సిస్టంలో అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. నూతన యాప్ లింక్ విధానంతో కొద్ది రోజులుగా జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలో ఉపాధి పనుల వద్ద కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. పనిలేని పేదలకు ఏడాదిలో కనీసం వంద రోజులపాటు, పని కల్పించాలని ఉద్దేశంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని అప్పటి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. అయితే తాజాగా ఈ పథకం పేరును జీ రామ్ జీ గా ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం మార్చింది. దీంతోపాటు ఈ చట్టంలో సరికొత్త మార్పులు కూడా తెచ్చింది. పని ప్రదేశంలో ప్రతికూలి ఫొటోను రెండుసార్లు తీయనున్నారు. ఉదయం 8 గంటలకు పనికి ముందు ఒకసారి, పని పూర్తయిన తర్వాత అక్కడే మరోసారి కూలీల ఫొటోలను లింక్ యాప్‌లో ఫీల్డ్ అసిస్టెంట్లు అప్‌లోడ్‌తో చేయాలని విధానాన్ని తీసుకొచ్చింది. ఈ నూతన యాప్ కారణంగా ఫీల్డ్ తరువాయి 2లో..

## మహిళల అభ్యున్నతే ప్రజా ప్రభుత్వ లక్ష్యం




## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరేందుకు శ్రమించాలి

### జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

**ప్రజాపక్షం/జగిత్యాల :** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరేందుకు నిరంతరం శ్రమించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాలోని కోడిమ్యాల మండలం నాచుపెల్లిలో శనివారం జిల్లా కలెక్టర్ పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న బోజన పథకాన్ని పరిశీలించి, వంట గది పరిశుభ్రత తదితర విషయాలను తరువాయి 2లో..



## విద్యతోనే మహిళా సాధికారత



మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్

వివరాలు 2లో

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరేందుకు శ్రమించాలి

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులను అడిగి తెలుసుకుని వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. 10వ తరగతి పరీక్షలు, ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా విద్యాధికారి రాము, డీపీవో మధన్ మోహన్, ఎంపీడీవో స్వరూప రాణి తదిత రులు ఉన్నారు. అనంతరం కొడిమ్యాల మండల కేంద్రంతో పాటు దమ్మయ్యపేట గ్రామంలో కలెక్టర్ పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా గ్రామంలో చేపడు తున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. డ్రైనేజీ వ్యవస్థను పరిశీ లించి పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డీపీవో మదన్ మోహన్, హౌజింగ్ అధికారి ప్రసాద్ ఉన్నారు.

## శాతవాహనలో స్వచ్ఛభారత్ ప్రారంభం

ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్ : శాతవాహన విశ్వవిద్యాలయం ఆవరణలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పదిరోజుల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్ట్స్ న్యాయ కళాశాలలో రిజిస్ట్రార్ ఆచార్య పి.సతీష్ కుమార్ స్వచ్ఛభారత్‌ను ప్రారం భిస్తూ కళాశాలలో పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రతలో భాగంగా చెత్తను వేరు చేయాలని పిలుపు నిచ్చి స్వచ్ఛతతో తెలంగాణను, దేశాన్ని పరిశుభ్రం చేయాలని పిలుపునిచ్చి న్యాయ కళాశాల, ఆర్ట్స్ కళాశాల జాతీయ సేవా పథకం విద్యార్థులతో కలిసి ఆవరణను శుభ్రపరిచారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ రమాకాంత్, కామర్స్ ప్రిన్సిపల్ డాక్టర్ హరికాంత్, ఎన్ఎస్ఎస్ అధికారి డా.తిరు పతి, ఫార్మసీ ప్రిన్సిపల్ శ్రీశైలం, ఆర్ట్స్ కళాశాల, న్యాయ ప్రిన్సిపల్ పద్మావతి, వైస్ ప్రిన్సిపల్ మహమ్మద్ అబ్రరుల్ భాఖి తదితరులున్నారు.

## ఆరోగ్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్

ప్రజాపక్షం/పెద్దపల్లి : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 100 రోజుల కార్య క్రమంలో భాగంగా 6.3.2026 నుండి ఆరోగ్య శాఖ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో స్పెషలిస్ట్ ఆరోగ్య సేవలు రోజు ఒక ఆరోగ్య కేంద్రములో నిర్వహి స్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధి కారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్ అన్నారు. ఇందులో గైనకాలజీ, పీడియాట్రిక్, ఆర్థో పెడిక్, ఆప్తల్మోలజీ, జనరల్ మెడిసిన్ మరియు డెంటల్ స్పెషలిస్ట్ సేవలు అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలోని స్పెషలిస్ట్ సేవలను సమీప ఆరోగ్య కేంద్రం లో నిర్వహించిన పుడు ప్రజలు సద్వినియోగం చేసు కావా లని కోరారు.

# ఉపాధి కూలీలకు ఫొటోల తిప్పలు!

(మొదటి పేజీ తరువాయి)

అసిస్టెంట్లు నిర్దేశించిన మేరకు పనులను చేయించలేక కూలీల ఫొటోలు తీసి అప్లోడ్ చేయడానికే పరిమితం అవు తున్నారు. అయితే ఈ విధానం కూలీలకు తలనొప్పిగా మారింది. సాంకేతిక సమస్యలతో తీవ్ర ఇబ్బందులను తెచ్చి పెడుతోంది. కూలీలు చేసే పని ప్రదేశంలో ఇంటర్నెట్, సర్వర్ సమస్యలతో ఫోన్లో ఫోటో స్కాన్ కావడం లేదు. సదరు యాప్‌లో కూలీ ఫోటో విజయవంతంగా అప్లోడ్ అయితేనే హాజరు నమోదు అయినట్లుగా ఫీల్డ్ అసిస్టెంట్ చెబుతున్నారని అంటున్నారు. అనేకమందికి ఈ ఈ ప్రక్రి యలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. దీంతో కూలీల హాజరు నమోదుగాక వారు వేతనాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఫోటో స్కాన్ కోసం కూలీలు గంటల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి నెల కొంది. మరోవైపు అటెండెన్స్ కోసం గ్రూప్ ఫోటోకు బదులు ఎన్.ఎం.ఎం.ఎస్ యాప్‌లో ఒక్కో కూలి ఐరిస్ తీసుకోవాలని నిర్ణయించారు. కానీ మూడు నాలుగు రోజుల నుండి కూలీల ఐరిస్ యాప్ లో కాప్చర్ కావడం లేదు .దీంతో పనికి వెళ్లిన కూలీలు గంటల తరబడి వేచి ఉండి చివరికి పని చేయకుండానే ఇంటికి వెను తిరుగుతు న్నారు.ఇలా కొన్ని రోజులుగా పని ప్రదేశాల నుంచి తిరిగొ స్తుండడంతో కూలీలు సహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ డిజి టల్ విధానాన్ని తెచ్చినప్పటికీ సాంకేతిక కారణాలవల్ల పేద కూలీలు కష్టార్జితాన్ని కోల్పోతున్నారు. దీంతో ఈ ఉపాధి చట్టంలో కేంద్రం తీసుకొచ్చిన మార్పులపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం ప్రకటించిన కనీస వేతనాల కంటే ఇంకా తక్కువ వేతనాలే ఉపాధి కూలీలకు అందుతు న్నాయి. వీరి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నెట్‌వర్క్ లేని ప్రదేశాల్లో ఆఫ్‌లైన్ మోడ్‌లో ఫోటోలు తీసి సిగ్నల్ ఉన్నచోట అప్లోడ్ చేసే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించాలి. వీలైతే రెండుసార్లు ఫోటోలు తీసే కార్యక్రమాన్ని తక్షణమే రద్దు చేయాలని కనీస వేతనాలు పక్కాగా అమలు చేయా లని ఉపాధి హామీ కూలీలు ప్రభుత్వాలను కోరుతున్నారు.

## మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి

ప్రజాపక్షం/కరీంనగర్ : మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని, ఉద్యోగాలు, వ్యాపారాల ద్వారా ఆర్థిక సాధికారత సాధించాలని, తద్వారా సమాజంలో గుర్తింపు పొందాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళా ఉద్యో గులు, అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి హాజరైన అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో నాయకత్వ బాధ్య తలను చేపట్టాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ, ప్రైవేటు అవ కాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగా లని సూచించారు. ఉన్నత విద్య అభ్యసించి మంచి గుర్తింపు పొందవచ్చని తెలిపారు. వ్యాపార రంగంలోనూ మహిళలు తమదైన ముద్ర వేస్తూ రాణిస్తున్నారని అన్నారు. అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ మాట్లాడుతూ, లింగ వివక్ష లేని సమాజాన్ని నిర్మించినప్పుడే అసలైన అభివృద్ధి సాధ్య మని అన్నారు. మహిళా అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కోరారు. దేశ అభివృద్ధికి, ప్రగతికి మహిళలు మూలస్తంభ మని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్వర్, మహిళా అధికారులు, ఉద్యోగులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిధులు మంజూరు చేసిన మంత్రికి సర్పంచుల కృతజ్ఞతలు

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండ లంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో సిసి రోడ్ల నిర్మాణా నికి, ఇతర అభివృద్ధి పనుల కోసం కోటి పది లక్షల రూపా యల భారీ నిధులను మంజూరు చేయించిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకి ముత్తారం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు బియ్యాని శివకుమార్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు హృదయపూర్వక కృత జ్ఞతలు తెలిపారు. మంత్రి సహకారంతో నిధులు మంజూ రైన గ్రామాలలో అడవి శ్రీరాంపూర్, కేషనపల్లి, దర్యాపూర్, హరిపురం, పారుపల్లి, జిల్లాలపల్లి, సీతంపేట, ఇప్పలపల్లి. ముత్తారం, పోతారం, మచ్చుపేట, లక్కారం, ఖమ్మంపల్లి గ్రామాలు ఉన్నాయి. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లా డుతూ.. ముత్తారం మండల అభివృద్ధిపై మంత్రి శ్రీధర్ బాబు చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధకు ఈ నిధుల మంజూరే నిద ర్శనమని కొనియాడారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేసినందుకు గాను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శ్రీధర్‌బాబు నాయకత్వంలో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు.

## ప్రజలకు రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలం



ప్రజాపక్షం/పెద్దపల్లి : రామగుండం నియోజకవర్గంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ప్రజలకు రక్షణగా నిలవాల్సిన పోలీసులు నియంతలా బాధితులపైకే లాఠీలు ఝులిపుతున్నారని, బాధితుల పక్షాన ప్రశ్నించే ప్రతిప క్షాలు, ప్రజలు, న్యాయవాదులపై అమానుషంగా ప్రవర్తిస్తు న్నారని బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం గోదావరి ఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార నిరసన దీక్షలకు వ్యాల్ల హరీష్ రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రామగుండంలో రాజ్ ఠాగూర్ ప్రజా పాలన పేరుతో నిరుపేదల ఇండ్లు కూల్చడం ప్రశ్నించే గొంతుకను అణగదొక్కడంగా రాజ్యమేలుతున్నారని, ప్రజాస్వామ్యా నికి ఇలాంటి విధానం మంచిది కాదని రామగుండం ఎమ్మెల్యే వెంటనే సీఐపై చర్యలు తీసుకొని న్యాయవాదు లకు భద్రత కల్పించాలని కోరారు. గత నెల రోజుల క్రితం స్థానిక న్యాయవాది మార్కాపురం తిలక్‌పై వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి అనుచితంగా అమర్యాదగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ అధికార ప్రతినిధి జాహిద్ పాషా, మాజీ కార్పొరేటర్ బొబ్బిలి సతీష్, బక్కీ కిషన్, బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పోలాడి శ్రీనివాస్ రావు, పర్వ స్వాతి, యువ జన విభాగం అధికార ప్రతినిధి బూరుగు వంశీ కృష్ణ, అల్లి గణేష్, బొట్ల పోషం, కడమండ్ల శ్రీహరి, కొండ సురేష్, పోయిల రవి ముజీబ్, రెహమాన్, షరీఫ్, అబ్దుల్ ఖాదీర్, దాడి తిరుమల్, ఉదయ్, శ్రీనివాస్ రావు, యుగేందర్, శివానంద, ప్రవీణ్ ,తదితరులు పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ప్రజాపక్షం/ఖానాపూర్ : ఖానాపూర్ మండలం సేవ నాయక్ తండా గ్రామంలో 10 లక్షలతో వివో భవనం,10 లక్షలతో రైతు వర్క్ షెడ్,12 లక్షలతో అంగన్వాడీ భవనాలకు భూమి పూజ చేసిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సార థ్యంలో ప్రజా ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు అమల వుతున్నాయని, మహిళలను ఆర్థికంగా కోటీశ్వరులను చేయడమే, అదే విధంగా ఇగ్నల్పూర్ గ్రామంలో నూతన ఇందిరమ్మ గృహప్ర వేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. పేదింటి వారి ఇంటి నిర్మాణం కలని నెరవేర్చడంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవానాయక్ తాండ, ఎగ్బల్ పూర్ సర్పంచ్లు స్రవంతి గోపి నాయక్, రెడ్డి పద్మ నరేందర్ ఉప సర్పంచ్లు సంబం ధిత అధికారులు, మహిళలు, గ్రామ రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయ కులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే మహిళా సాధికారత

ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : మహిళా సాధికారితకు విద్య ఎంతో కీలకమని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా చైర్ పర్సన్ హాజరై మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు ప్రతి రంగంలో తమ ప్రతిభను చాటు తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు సోషల్ మీడి యాకు దూరంగా ఉండి తమ లక్ష్యాల సాధనకోసం కృషి చేయాల న్నారు. అనంతరం కళాశాలలో వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో కరస్పాడెంటెంట్ యాద రామకృష్ణ, డైరెక్టర్ పల్లెల నరేష్, ప్రిన్సిపాల్ రాజేందర్ తదితరులు ఉన్నారు. అంతకు ముందు చైర్ పర్సన్ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక క్యాక్రమంలో భాగంగా పట్టణంలోని 29వ వార్డులో పర్యటిం చారు. శానిటేషన్ పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమలో కౌన్సిలర్ తోపారపు లావణ్య రజనీ కాంత్ తదితరులు ఉన్నారు.

## శ్రీవేదం ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవం




ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్ : శ్రీ వేదం ఉన్నత పాఠశాలలో అంత ర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశంలోని వివిధ రంగాలలో గల ప్రముఖ మహిళలను గుర్తు చేసుకుంటూ నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పాఠ శాల కరెస్పాండెంట్ డాక్టర్ బొమ్మ శ్రీనివాస్ గౌడ్ సమాజంలో మహిళల పాత్రను వివరించారు. ప్రతి మహిళా టీచర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : జిల్లాలో పనిచేస్తున్న ఔట్సో ర్సింగ్ సిబ్బంది న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పెద్దపెల్లి జేఏసీ అధ్యక్షులు బోడ శివకుమార్ డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర ఔట్సోర్సింగ్ జేఏసీ కమిటీ పిలుపుమేరకు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఔట్సోర్సింగ్ ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీలను వెంటనే రద్దుచేసి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని, రాష్ట్రంలో జిల్లాలో తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, 9 నెలలు కావస్తున్న జీతాలు చెల్లించలేదని, కావున వెంటనే రెన్యువల్ చేస్తూ జీతాలు చెల్లించాలని మరియు చనిపోయిన ఉద్యోగులకు 20 లక్షలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మహిళా ఉద్యోగులకు వేత నంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా జేఏసీ అధ్యక్షులు బొడ శివకు మార్ JAC సభ్యుల పాల్గొన్నారు.

## వైభవంగా బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండల కేంద్రం లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయ వార్షి కోత్సవంలో భాగంగా బ్రహ్మోత్సవాలు రెండు రోజుల నుండి వైభవంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజు శనివారం ప్రధాన అర్చకులు వెంకట మాధవచార్యులు స్వామి వారికి ప్రత్యేక హోమం ఇతర కార్యక్రమాలలో జరిపించగా మూడవ రోజు ఆ దివారం స్వామివారి కల్యాణాన్ని ఘనంగా చేపట్టారు. పాల్గొన్న వారిలో గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ ఆలయ కమిటీ చైర్మన్ రాజన్న, సభ్యులు జీవన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భక్తులు, తదితరులు ఉన్నారు.

## ఆంజనేయస్వామి దేవస్థానంలో షెడ్డు నిర్మాణానికి హామీ

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామ ప్రజలు గ్రామంలో గల ఆంజనేయ స్వామి దేవస్థానములో హనుమాన్ భక్తులకు సరైన వసతులు లేక వేసవికాలంలో అంజన్న దీక్ష సమయాలలో ఆంజనేయ స్వామిలుకు భక్తులకు ఇబ్బందిగా మారిందని ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద షెడ్డు నిర్మాణానికి 5 లక్షల నిధులు మంజూరు చేయాలని శనివారం జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సానుకూలంగా స్పందించి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ ఎఎంసి చైర్మెన్ కొలుగూరి దామోదర్ రావు, మాజీ సర్పంచులు శీలం మల్లేశం, ప్రభాకర్, శ్రీను, గంగాధర్, వంశీ పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న మాజీ మంత్రి

**ప్రజాపక్షం/మల్యాల :** నోరు లేని జీవాల పట్ల దయ చూపుతూ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మంచి మనసును చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే జగిత్యాల జిల్లా కొండగట్టు పుణ్యక్షేత్రంలో ఆకలితో అల్లాడుతున్న కోతులకు శనివారం అరటి, సపోటా పండ్లు పంపిణీ చేసి మానవత్వాన్ని చూపించారు. నోరు లేని జీవాల పట్ల ప్రేమ చూపించడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అభిప్రాయపడ్డారు.

## వంటగ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ నేడు సిపిఎం ఆందోళనలు

**ప్రజాపక్షం/కరీంనగర్ :** కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం సామాన్యుడి నడ్డి విరుస్తూ గృహ వినియోగ,వంట గ్యాస్ సిలిండర్ ధరను రూ.60లు, కమర్షియల్ సిలిండర్ ధరను రూ.115లు పెంచడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) కరీంనగర్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.తక్షణమే పెంచిన వంట గ్యాస్ ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని, నిత్యావసర వస్తువుల ధరల అదుపుకు తక్షణమే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎం) డిమాండ్ చేస్తోంది. పెంచిన ధరలకు వ్యతిరేకంగా జిల్లా వ్యాపితంగా రేపు జరిగే నిరసన కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులతో పాటు సామాన్య ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోండి



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు వరంగల్ డిక్లరేషన్లో చేసిన హామీలను తూచా తప్పకుండా నెరవేర్చాలని ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలనీ భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు కాసారపు భూమారెడ్డి అన్నారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ శ్రీనివాస్కు శనివారం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వందల హెక్టార్లలో రైతులు మొక్కజొన్న పంటలు పండించారని రాష్ట్ర ప్రభుత్వం మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల లోపు ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని, రైతు భరోసా నిధులు విడుదల చేయాలని, సన్నవడ్లకు ఇస్తామన్న బోనస్ చాలామంది రైతులకు నేటి వరకు ఇవ్వలేదని, అకాల వర్షాలతో నష్టపోయిన మామిడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకపోవడంతో రైతులు నిరుత్సాహంతో ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో కిసాన్ సాంగ్ నాయకులు చిట్యాల లక్ష్మణ్, మహిపాల్ రెడ్డి, మొరపు గంగారాజం, సత్యనారాయణ గౌడ్, శేఖర్ ,మోహన్ రెడ్డి, ఆనందరెడ్డి, లక్ష్మణ్, రమేష్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# మెట్పల్లి పట్టణంలో పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే



**ప్రజాపక్షం/మెట్పల్లి :** జగిత్యాల జిల్లా మెట్పల్లి పట్టణంలో ప్రజల ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేను కరీంనగర్ గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ నిర్వహించారు. జాతీయ గణాంక శాఖ 2026 సంవత్సరానికి గాను దేశవ్యాప్తంగా ప్రజల ఉపాధి పరిస్థితులపై ఈ సర్వే చేపట్టినట్లు ఆయన తెలిపారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, గ్రామాలను ఎంపిక చేసి ప్రజల ఉపాధి స్థితిగతులపై సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. మొదట కుటుంబాల సాధారణ వివరాలను సేకరించిన అనంతరం ట్యాబ్ ద్వారా పట్టణంలోని కొన్ని కుటుంబాలను ఎంపిక చేసి, మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి స్థాయి సర్వే నిర్వహించి ప్రత్యేక ట్యాబ్లో వివరాలను నమోదు చేస్తామని గుర్రం శ్రీనివాస్ గౌడ్ వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎం. స్పందన, మున్సిపల్ మేనేజర్ ఎస్. వెంకటలక్ష్మి, ఎంపీ ఎస్ఓ గంగారెడ్డి, మున్సిపల్ వార్డ్ ఆఫీసర్లు మాదారపు ప్రగతి, ముద్దం రచన, బిల్ కలెక్టర్లు పటేరి ధర్మేందర్, కుంట నిఖిల్, పాలెపు స్వప్న, మార్గం రాకేష్, మున్సిపల్ మెప్మా సెక్షన్ సిబ్బంది, ఆర్పీలు గుజ్జేటి సరోజ, సుద్దాల అమల, జంగం స్వప్న,తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి చిత్తశుద్ధితో గౌరవెల్లి ప్రాజెక్టుకు నీరందించాలి

**ప్రజాపక్షం/చిగురుమామిడి :** మంత్రి పొన్నం ప్రభాకర్ పార్టీలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేయాలని, పక్షపాత వైఖరి మానుకుని చిత్తశుద్ధితో గౌరవెల్లి ప్రాజెక్టు నుంచి రైతులకు సాగునీరు అందించాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అన్నారు. చిగురుమామిడి మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేసి రెండు సంవత్సరాలు పూర్తయినా అరకొర పనులు చేసి ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. చిగురుమామిడి, సైదాపూర్ మండలాలకు తోటపల్లి రిజర్వాయర్ ద్వారా 23 వేల ఎకరాలకు సాగునీరు అందించామని అన్నారు. ప్రతిపక్ష నాయకుడు సిపిఐ నేత చాడ వెంకటరెడ్డి సైతం గోదావరి జలాలను చూసి సొంత గ్రామం రేకొండలో సంతోషం వ్యక్తం చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల్లో తప్ప చేతుల్లో పనులు లేవని ఎద్దేవా చేశారు. ప్రజలతో ఎన్నుకోబడిన సర్పంచులకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు ఇవ్వాల్సిన అవసరం ఉందని, కేవలం కాంగ్రెస్ కండువా కప్పుకున్న వారికి మాత్రమే గ్రామాల్లో నిధులు మంజూరు చేయడం ఏమిటని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పాలనలో గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసినప్పటికీ కాంగ్రెస్ నాయకులు కేసులు వేసి పనులు అడ్డుకున్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణమాచారి, సింగిల్ విండో మాజీ చైర్మన్ జంగా రమణారెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు పెనుకుల తిరుపతి, సాంబారి కొమురయ్య, సర్పంచులు ఆకవరం భవాని, సన్నీల కవిత, సాంబారి బాలమ్మ, ఒంటెల కిషన్ రెడ్డి, బోయిని రమేష్, కర్వేద మహేందర్ రెడ్డి, పెపాషా, సంపత్రెడ్డి, రాజిరెడ్డి, సంజీవ్ కుమార్, కొమురయ్య, కృష్ణారెడ్డిలున్నారు.

# విజ్డమ్ హైస్కూల్లో మహిళా దినోత్సవ వేడుకలు




**ప్రజాపక్షం/రాయికల్ :** స్థానిక విజ్డం ఉన్నత పాఠశాలలో శనివారం రోజు ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కేకు కట్ చేసి ఘనంగా నిర్వహించారు .విద్యార్థినిలు సమాజంలో మహిళలు,ఆడపిల్లలు ఎదురుకుంటున్న సమస్యలు వివిధ రకాల వేషధారణలతో, నృత్యాలతో కళ్ళకు కట్టినట్టు చూపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాయికల్ మున్సిపల్ నూతన రెండవ కార్యవర్గం హాజరయ్యారు.ఈ కార్యక్రమం లో పాఠశాల కరెస్పాండెంట్ ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా ఉన్న మన దేశంలో మన రాయికల్ మున్సిపాలిటీ లో 12 కౌన్సిలర్ స్థానాల్లో 7 మంది మహిళలు ఉండడం నిజమైన మహిళా సాధికారత అని ప్రతి మగవారి విజయం వెనుక మహిళ ఉంటుందనేది నా నిజజీవిత అనుభవమని మహిళల గౌరవం, సమానత్వం మరియు హక్కులను కాపాడటం మనందరి బాధ్యత అని,మహిళలు కుటుంబానికి, సమాజానికి పునాది. మున్సిపల్ చైర్మన్ కటుకం రవి మాట్లాడుతూ తన చిన్నతనం నుండి ఎన్నో కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని ఇప్పుడు ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చానని, తన ఒడిదుడుకుల జీవిత ప్రయాణంలో తన భాగస్వామి పాత్ర అనిర్వచనీయమని అన్నారు. వైస్ చైర్పర్సన్ తురగ సౌజన్య శ్రీధర్ రెడ్డి మహిళ వార్డు కౌన్సిలర్లు తోపారపు ప్రశాంతి, కూనారపు మానస భూమేష్, వేముల నాగరాజు మచ్చ గంగ లక్ష్మీ లు తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన జిల్లా వైద్య నిపుణురాలు డాక్టర్ శ్వేత చొల్లంకి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత పాఠశాలలోనే మీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాకారం కోసం ప్రయత్నం చేయాలన్నారు. చిన్న బెల్లాల్ సర్పంచ్ లక్ష్మి భూమన్న పాల్గొని మహిళల యొక్క గొప్పతనం ఉదయం నుండి రాత్రి వరకు వారు పడే కష్టాలను గురించి వివరించారు. మున్సిపల్ కౌన్సిలర్ లను, మహిళా ఉపాధ్యాయులను, కర్మచారినులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నివేదిత రెడ్డి, వార్డ్ కౌన్సిలర్లు రాకేష్ నాయక్, పుల్లె శ్రీధర్,ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని, విద్యార్థులు, ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పోషకాహార పథకాలను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** గర్భిణీలు, చిన్నారుల ఆరోగ్యానికి ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ అడువాల జ్యోతి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని 40 వార్డులో శనివారం గర్భిణీ స్త్రీలకు అంగన్ వాడీ కేంద్రాల నిర్వాహకుల ఆధ్వర్యంలో శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. జ్యోతి హాజరై గర్భిణీలకు పండ్లు, ఫలహారాలు అందజేశారు.

## అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన

**ప్రజాపక్షం/పెగడపల్లి :** మండలంలోని కీచులాటపల్లి అంగన్వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ రాచకొండ ఆనంద్ హాజరై ఆరు నెలల నిండిన చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల సమగ్ర అభివృద్ధి అంగన్వాడీ కేంద్రాల ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. చిన్నారులకు పోషకాలతో కూడిన సమతుల్య ఆహారం అందించాలని, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఆరు నెలలు దాటిన తర్వాత అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం సరఫరా చేసే బాలామృతం వంటి అనుబంధ ఆహారాన్ని అందించడం ద్వారా పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఈరి కనకయ్య, వార్డు సభ్యులు,పంచాయతీ కార్యదర్శి శీలం నరేందర్, అంగన్వాడీ టీచర్ లింగంపల్లి పద్మ, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## వెల్లుల్ల గ్రామంలో శ్రమదానం

**ప్రజాపక్షం/మెట్పల్లి :** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా శనివారం వెల్లుల్ల గ్రామంలోని పాఠశాల ఆవరణలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పరిశుభ్రత కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని శ్రమదానం చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుడూరు తిరుపతి రజిని, పంచాయతీ కార్యదర్శి సేదాలు నారాయణ, ఉపసర్పంచ్ అనిరెడ్డి రాజశేఖర్, జీపీఓలు నాగరాణి, రాజేశ్వర్, వార్డు సభ్యులు హరీష్, రాజు, భూమేష్, జూనియర్ అసిస్టెంట్, అంగన్వాడీ టీచర్లు, గ్రామ ప్రజలు కూడా ఉత్సాహంగా పాల్గొని శ్రమదానం చేశారు.

## మహిళా సమరానికి చట్టమే ఆయుధం

**ప్రజాపక్షం/కరీంనగర్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక అపూర్వ ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే. రాణి ఆదేశాలతో న్యాయ చైతన్య సదస్సును నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు మరియు పానెల్ అడ్వకేట్ లు మాట్లాడుతూ ఆడపిల్లలకు కేవలం చదువు మాత్రమే కాదని తమను తాము రక్షించుకునే చట్ట బలం కూడా ఉండాలని అన్నారు. వేధింపులను భరించడం అంటే నేరాన్ని ప్రోత్సహించడమేనని స్పష్టం చేశారు. నూతన భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) లోని కఠినమైన సెక్షన్లు నేరగాళ్ల గుండెల్లో వణుకు పుట్టిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా పెళ్లి పేరుతో మోసం చేసే సెక్షన్ 69, వేధించే సెక్షన్ 78 వంటివి మహిళల భద్రతకు కవచంగా ఉన్నాయని వివరించారు. ఏ పోలీస్ స్టేషన్లోనైనా కేసు నమోదు చేసే జీరో ఎఫ్.ఐ.ఆర్ హక్కు గురించి బాధితులకు అందే ఆర్థిక పరిహారం, ఉచిత న్యాయవాది సదుపాయం గురించి తెలియపరిచారు. విద్యార్థినుల నుంచి విశేష స్పందన లభించింది. అపూర్వ కాలేజీ విద్యార్థినులందరూ ముక్తకంఠంతో మహిళా చైతన్య ప్రతిజ్ఞ చేస్తూ అన్యాయంపై గళమెత్తుతామని శపథం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సభ్యులు, రంగయ్య పటేల్, చంద్ర ప్రకాష్ రెడ్డి, వి.కిరణ్ కుమార్, పానెల్ అడ్వకేట్ లు ఎస్విఆర్ కృష్ణ, శ్రీలక్ష్మి, సమతా రాణి, నాజియా కుతీజా, అశ్వని, బలుసుల శాంతి కుమార్ లతో పాటు కళాశాల చైర్మన్ పి.వేణు, ప్రిన్సిపాల్ కే.మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ రాధిక,అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొని సదస్సును విజయవంతం చేశారు.

## ముగిసిన వార్డు సభ్యుల శిక్షణ



ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి : గత ఐదు రోజులుగా మండల కేంద్రంలోని రైతువేదికలో కొనసాగిన గ్రామపంచాయతీ వార్డు సభ్యుల శిక్షన కార్యక్రమం శనివారం ముగిసిందని ఎంపిడిఒ చింత రాజశ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి, పారదర్శక పరిపాలన, పంచాయతీరాజ్ వ్యవస్థలో వార్డు సభ్యుల పాత్రపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం వార్డు సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ సదాశివ, కార్యదర్శులు , వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## కౌటాల మినీ స్టేడియంలో ఉచిత శిక్షణ




ప్రజాపక్షం/కౌటాల : కౌటాల మినీ స్టేడియంలో విద్యార్థులకు ఎంపిక పరీక్షల కోసం ఉచిత శిక్షణ నిర్వహించనున్నట్లు కోచ్ పోరేత్ భరత్ తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఎంపిక పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 9వ తేదీ నుంచి ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణలో భాగంగా శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు పరీక్షలకు అవసరమైన మెలకువలను నేర్పించనున్నట్లు వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు మరిన్ని వివరాల కోసం 7093856135 నంబరులో సంప్రదించాలని కోరారు.

## పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేత



ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి : మండలంలోని హాసకొత్తూర్ గ్రామంలో తెడ్డు వసుంధర రమేష్ కూతురు డాక్టర్ తెడ్డు కస్తూరి జన్మదినం వేడుకలు గ్రామపంచాయతీలో సర్పంచ్, పాలకవర్గం, పంచాయతీ పారిశుధ్య కార్మికుల మధ్య శనివారం ఘనంగా నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూతురు జన్మదినం మీ మధ్య జరపడం చాలా సంతోషంగా ఉందన్నారు. పారిశుధ్య కార్మికులందరికి బట్టలు అందజేశామని, అలాగే మీరు చేసే పనిలో పూర్తి నిబద్ధతతో చేసి మన గ్రామానికి సర్పంచ్‌కు మంచి పేరు తేవాలని మీకు భవిష్యత్తులో ఎలాంటి అవసరాలకైనా మా కుటుంబం ముందు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నలిమెలా రేవతి గంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నవీన్‌గౌడ్, పాలకవర్గం సభ్యులు రాదారపు గంగాధర్, కనక నర్సయ్య, ఎక్స్ ఎంపీటీసీ జంగం మహేష్‌లు పాల్గొన్నారు.

# చాణక్య పాఠశాల 'టాలెంట్ విస్టా'అద్భుతం




ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : నిర్మల్ పట్టణంలో శనివారం విద్యా,సేవా రంగాల కలయికతో సందడి నెలకొంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి పట్టణంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన మహిళ దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మహిళా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలుపుతూ,సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు.అనంతరం చాణక్య హైస్కూల్ యాజమాన్యం నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవం,'టాలెంట్ విస్టా' విజ్ఞాన ప్రదర్శనను ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు.రెడ్డి కన్వెన్షన్ హాల్ ఆవరణలో విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టి రూపొందించిన విజ్ఞాన ప్రదర్శన సందర్శకులను మంత్రముగ్ధులను చేసింది.జిల్లాలోనే మొట్టమొదటిసారిగా వందకు పైగా ప్రయోగాలతో ఈ స్థాయి ప్రదర్శనను నిర్వహించడం అభినందనీయమన్నారు.ముఖ్యంగా పర్యావరణ, కాలుష్య నివారణ మార్గాలు,ఆధునాతన సాంకేతికత, ఆరోగ్య సూత్రాల పై చిన్నారులు తయారు చేసిన నమూనాలు వారి శాస్త్రీయ దృక్పథాన్ని చాటిచెప్పాయి.పాఠశాల డైరెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, సర్ సివి రామన్ వంటి గొప్ప శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ ప్రదర్శనలో సెన్స్, సోషల్ వర్కింగ్ మోడల్స్‌తో పాటు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు,నాటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ చంద్రిక, ఈడాక్ కోఆర్డినేటర్లు అనామిక,అభిశాంత్,అమృత జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ లావణ్య, పాఠశాల డైరెక్టర్లు సి.హెచ్.వెంకట్ రెడ్డి, టి.ప్రమోద్‌రావు, ఏ.ప్రభాకర్, కే.శంకర్, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గ్యాస్ ధరల పెంపుపై ఆమ్ ఆద్మీ ఆగ్రహం




ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరను రూ.60,కమర్షియల్ సిలిండర్ ధరను రూ.115 పెంచుతూ తీసుకున్న నిర్ణ యం అత్యంత దుర్మాగమైనదని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. నిర్మల్ జిల్లా కేంద్ర ంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సయ్యద్ హైదర్ మాట్లాడుతూ, అంతర్జాతీయ పరిణామాలను సాకుగా చూపి కేంద్రం సామాన్యుడి జేబులు గుల్ల చేస్తోందని మండిపడ్డారు.2014లో అధికారంలోకి వచ్చే నాటికి రూ.410 ఉన్న సిలిండర్ ధన నేడు హైదరాబాద్‌లో రూ.965కు చేరడం గమనార్హమని, గత 12 ఏళ్లలో సామాన్యుడి ఆదాయం పెరగకపోయినా గ్యాస్ ధర మాత్రం 130 శాతం పెరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కమర్షియల్ సిలిండర్ ధర పెరగడం వల్ల రవాణా, హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార పదార్థాల ధరల పెరిగి ద్రవ్యోల్బణం భారం పరోక్షంగా సామాన్యుడిపైనే పడుతోందని హైదర్ పేర్కొన్నారు.అంతర్జాతీయ మా ర్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పుడు ఆ లబ్ధిని ప్రజలకు చేరవేయని మోదీ ప్రభుత్వం, పెరిగినప్పుడు మాత్ర వెంటనేన భారాన్ని ప్రజలపై మోపుతూ ద్వంద్వ నీతిని ప్ర దర్శిస్తోందని ధ్వజమెత్తారు. గ్యాస్ సిలిండర్లపై వసూలు చే స్తున్న 5 శాతం జీఎస్టీ ద్వారా ధర పెరిగిన ప్రతిసారీ ప్రభు త్వ ఖజానా నిండుతోందని,ప్రజల కష్టాల్లో కూడా లాభం వెతుక్కునే ధోరణి వీడాలని హితవు పలికారు.కేంద్ర ప్ర భుత్వం తక్షణమే పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని,పాత పద్ధతిలో గ్యాస్ సబ్సిడీని పునరుద్ధరించాలని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేసింది.అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వంతుగా వ్యాట్ తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించాలని కోరారు.

# సర్పంచ్ జక్కు సుష్మాకు వాసవీ ఎక్సలెన్సీ అవార్డు



ప్రజాపక్షం/జన్నారం : జన్నారం మండలంలోని పొనకల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జక్కు సుష్మా భూమేష్ వాసవీ ఎక్సలెన్సీ అవార్డును అందుకున్నారు. అంతర్జాతీ య మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని ఎ స్‌విఎమ్ గ్రాండ్ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన వాస వీ క్లబ్ సికింద్రాబాద్ కపుల్స్ సమావేశంలో ఈ పుర స్కారాన్ని అందజేశారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసి డెంట్ సిద్ధ వెంకట సూర్య ప్రకాష్ రావు చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును స్వీకరించారు. గత ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలుపొందినందుకు గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. అవార్డు అందుకున్న సర్పంచ్ జక్కు సుష్మా భూమేష్‌ను జిల్లా, మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ సికింద్రాబాద్ కపుల్స్ అధ్యక్షుడు గోలి రమేష్, సెక్రటరీ వినోద్ పసునూరి, ట్రెజరర్ రవి కొండూరి పాల్గొన్నారు.

# సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



ప్రజాపక్షం/కాగజ్‌నగర్ : మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వచ్చి సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఎంఎల్‌సి దండే విఠల్ పేర్కొన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని గాంధీ పార్క్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సమాజం మరింత ముందుకు సాగుతుందని తెలిపారు. మహిళల సాధికారత, వారి హక్కులు, అభివృద్ధిపై పలువురు వక్తలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సి అండ్ డిఎంఎ హైదరాబాద్ ప్రత్యేక అధికారి సాయి, మున్సిపల్ చైర్‌పర్సన్ షహీన్ సుల్తానా, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ కొత్తపల్లి అనిత, మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎబి రామాదేవి, టిఎంసి ఉషా, సిఒ రేణుక, మున్సిపల్ సిబ్బంది, ఆర్పిలు, ఎస్‌హెచ్‌జి సభ్యులు, కౌన్సిలర్లు, పట్టణ మహిళలు పాల్గొన్నారు.

## శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



ప్రజాపక్షం/జన్నారం : జన్నారం మండలం రెండ్లగూడ గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి నిర్మల్ బిజెపి అధ్యక్షులు రితీష్ రాథోడ్ శనివారం రూ.30,300 విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణ పనులు త్వరగా పూర్తి కావాలని ఆకాంక్షిస్తూ ఈ ఆర్థిక సాయాన్ని అందించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రితీష్ రాథోడ్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో ఆలయాలు కీలక పాత్ర పోషిస్తాయని, ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. బిజెపి ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఆలయాల పునర్నిర్మాణానికి, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఆయన పేర్కొన్నారు. విరాళం అందజేసిన రితీష్ రాథోడ్‌కు గ్రామ భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెడద గోపాల్, సందేవేని పవన్, ఎల్లముల లక్ష్మ ణ్, తొట్ల కొమరన్న, సందవేని రవి, మల్యాల సంతోష్, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## వెంకట్రావుపేట్ రహదారిపై ఐరన్ గేట్ ఏర్పాటు



ప్రజాపక్షం/సిర్పూర్ టి : సిర్పూర్ టి మండలంలోని వెంకట్రావుపేట్ గ్రామంలో భద్రతను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రధాన రహదారిపై పోలీసులు ఐరన్ కామన్ గేట్‌ను ఏర్పాటు చేశారు. శనివారం స్థానిక పోలీసు సిబ్బంది గ్రామస్తులతో కలిసి ఈ గేట్‌ను అమర్చారు. గ్రామంలోకి భారీ వాహనాల రాకపోకలను తగ్గించడం, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నివారించడం ఈ చర్య ముఖ్య ఉద్దేశమని పోలీసులు వెల్లడించారు. ఈ గేట్ ద్వారా చిన్న వాహనాల రాకపోకలకు అనుమతి ఉన్నప్పటికీ, భారీ లారీలు వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. గ్రామ భద్రత దృష్ట్యా తీసుకున్న ఈ నిర్ణయానికి ప్రజలందరూ సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. పోలీసుల చొరవను అభినందిస్తూ స్థానిక ప్రజలు కూడా తమ పూర్తి మద్దతును ప్రకటించారు. పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు

## క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు సాధ్యం



ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని పిఆర్‌టియుటిఎస్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు సూచించారు. పెంచికల్‌పేట్ మండలంలోని చెడ్వాయి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల మధ్య మూడు రోజుల వ్యవధి ఉన్నందున, ప్రతి సబ్జెక్టుకు తగిన సమయం కేటాయించి ప్రణాళికాబద్ధంగా చదవాలని, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పిఆర్‌టియుటిఎస్ మండల శాఖ తరఫున గుండు యాదగిరి, చౌదరి వెంకటేష్ విద్యార్థులకు స్కేలు, పెన్సిల్, పెన్ వంటి విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట రమేష్, చౌదరి వెంకటేష్, తంగడపల్లి రాకేష్, బిక్షపతి, రిటైర్డ్ ఉపాధ్యాయులు రవికుమార్, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పురాతన ఆలయాలను పునరుద్ధరించాలి

### చరిత్ర పరిశోధకుడు రాజ్ కుమార్



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ నియోజకవర్గ కడెం మండల గంగాపూర్ పరిధి దేవునిగూడెం శివారులో క్రీ.శ 9వ శతాబ్దం నాటి అతి పురాతన విగ్రహాలను కనుగొనడం జరిగిందని ప్రముఖ చరిత్ర పరిశోధకుడు కరిపే రాజ్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా తను వాటి వివరాలు తెలుపుతూ కడెం నది ప్రాంతంలో 9వ శతాబ్దంలో రాష్ట్రకూటులు లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని నిర్మించారని కాలక్రమేణా వచ్చిన చాళుక్యులు,కాకతీయుల కాలంలో కూడా ఆలయం ఉన్నదని పేర్కొన్నారు. శిథిలావస్థలో ఉన్న ఆలయంలో లక్ష్మీ నరసింహస్వామి విగ్రహానికి తలభాగం దెబ్బతిన్నదని ఆలయ ఆవరణకి కొద్ది దూరంలో దుర్గను పోలిన విగ్రహం, చమరదారిని, గణపతి, విగ్రహం, నంది ప్రతిమలు ప్రస్తుతం దర్శనమిస్తున్నాయన్నారు. ఇలాంటి పురాతన చరిత్ర కలిగిన ఆలయాలు శిథిలావస్థలో గురువుతున్నా చూసి చూడనట్లు ఉండడం సరైనది కాదని, ఇలాంటి పురాతన ఆలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని సూచించారు

## రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలి

### వనిత వాక్కు ఫౌండేషన్ ప్రతినిధులు




**ప్రజాపక్షం / మంచిర్యాల టౌన్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మంచిర్యాల పట్టణంలోని సురభి గ్రాండ్ హోటల్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వనిత వాక్కు ఫౌండేషన్, నందగోపాల టీమ్ సంయుక్త సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. రక్తాన్ని దానం చేయండి ప్రాణాలను కాపాడండి అనే నినాదంతో చేపట్టిన శిబిరాన్ని ఫౌండేషన్ కోఫౌండర్లు తాళ్లపల్లి కవిత, సునీత కుర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక బిడ్డకు జన్మనిచ్చే తల్లి, రక్తదానం ద్వారా మరికొందరికి ప్రాణదాతగా నిలవడం గొప్ప విషయమని కొనియాడారు. మహిళల్లో రక్తహీనతపై అవగాహన కల్పించడమే ఈ శిబిరం ముఖ్య ఉద్దేశమని వారు తెలిపారు. సుమారు 100 మంది మహిళలు రక్తదానానికి ముందుకు రాగా, ఆరోగ్య పరీక్షల అనంతరం 17 మందిని అర్హులుగా గుర్తించి రక్తాన్ని సేకరించారు. రక్తదాతలకు లయన్స్ క్లబ్ ప్రతినిధులు శాలువాలతో సత్కరించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వనిత వాక్కు వ్యవస్థాపక అధ్యక్షులు రంగు వేణు కుమార్, గోనె భాగ్యలక్ష్మి, డాక్టర్ అన్నపూర్ణ, జోష్నా చంద్రదత్, డిఎండబ్ల్యూఓ రాజేశ్వరి, కోమరి చంద్రకళ, చిగురు మంజుల, సత్య శ్రీలత, అరుణ, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

## నిర్మల్ మున్సిపాలిటీలో ఘనంగా మహిళా దినోత్సవం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా కౌన్సిలర్లను, కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించే దిశగా ఒక చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టే ప్రతి అభివృద్ధి పని శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో వితంతు మహిళలను భాగస్వామ్యం చేస్తామని ఆమె వెల్లడించారు. రాజకీయ భాగస్వామ్యం అంటే కేవలం ఓటు హక్కుకు మాత్రమే పరిమితం కాదని, అన్ని రంగాల్లో మహిళలు క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆమె ఆకాంక్షించారు. ప్రస్తుత కాలంలో ప్రభుత్వ,ప్రైవేటు,సామాజిక సేవా రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా, అంతకంటే మిన్నగా రాణిస్తున్నారని కొనియాడారు. ప్రతి తల్లి తన పిల్లల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విద్యావంతులైనప్పుడే సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగడం సాధ్యమవుతుందని వివరించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మేనేజర్ మారుతి, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ హరీష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొని మహిళా లోకానికి శుభాకాంక్షలు తెలిపారు.

## మంచిర్యాల కార్పొరేషన్‌ను సుందరంగా తీర్చిదిద్దుతాం

### ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



**ప్రజాపక్షం / హాజీపూర్ :** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో శనివారం 16వ డివిజన్ ముల్కల్లలో పారిశుధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డు అధికారులతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు కార్పొరేషన్ పరిధిలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 60 డివిజన్లలో దశలవారీగా పనులు జరుగుతున్నాయని, ఇప్పటికే మొదటి దశలో మూడు డివిజన్లు పూర్తి చేసి నేడు మరో మూడు డివిజన్లలో పనులు చేపట్టామని వివరించారు. వీధుల్లోని చెత్తను తొలగించడం, పిచ్చి మొక్కలను నరకడం, రోడ్లపై గుంతలను పూడ్చడంతో పాటు విద్యుత్, తాగునీటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని, ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అన్వేష్, మేయర్ ధరణి మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, కార్పొరేటర్లు త్రివేణి, రాసమల్ల కమల శ్రీనివాస్, లగిశెట్టి రాజయ్య, చింతపండు శ్రీనివాస్, తూముల నరేష్, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

## మహిళల ఉపాధిపై దాడికి వ్యతిరేకంగా పోరాడుదాం

### మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళల పోరాట దినంగా జరుపుకుందాం

### ప్రగతిశీల మహిళా సంఘం పిలుపు



**ప్రజాపక్షం/బైంసా :** మహిళలు తమ మనుగడ, ఆత్మగౌరవం, సమాన పనికి సమాన వేతనం, సమాన ప్రాతినిధ్యం కోరకు సుదీర్ఘ పోరాటం జరిపి కొన్నింటిని అయినా సాధించుకొన్నారు. మానవ హక్కులే మహిళల హక్కులు అనే నినాదంతో నిరంతరం పోరాడుతూ. మార్చ్ 8 ని అంతర్జాతీయ శ్రామిక మహిళా హక్కుల దినంగా జరుపుకుంటున్నారు. ప్రగతిశీల మహిళా సంఘం (పి.ఓ.డబ్ల్యూ) ఈ సంవత్సరం మార్చి 8 సందర్భంగా శ్రామిక మహిళల ఉపాధిపై దాడికి వ్యతిరేకంగా పోరాడుదాం అనే పిలుపులో భాగంగా, బైంసా రూరల్ వానల్ పహాడ్, దేగాం గ్రామాల్లోని బీడీ కంపెనీలోని కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి, ప్రగతిశీల మహిళా సంఘం (పి.ఒ.డబ్ల్యు) నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ట లక్ష్మి మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని నీరుగారుస్తూ ఉపాధిని ఒక హక్కుగా కాకుండా ఒక సంక్షేమ పథకంగా కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని మార్చి విబిజి రాం జి పేరుతో,రాష్ట్రాలు 40 శాతం వాటా నిధులు కేటాయిస్తేనే పథకాన్ని అమలు జరిగేటట్టు మార్చడం, నిరుపేద గ్రామీణ శ్రామిక మహిళల పొట్ట కొట్టడమే, భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు గృహ కార్మికుల వేతనాల గురించి వ్యాఖ్యానిస్తూ, నిరుద్యోగం అధికంగా ఉన్న మన దేశంలో జీతాలు పెంచాల్సిన అవసరం లేదని అనడం అసంఘటిత రంగ కార్మికుల రాజ్యాంగబద్ధ హక్కును అపహాస్యం చేయడమే అవుతుందనీ అన్నారు.కార్మిక చట్టాలను కుదించి పని గంటలను పెంచి,రాత్రి వేళల్లో పనిచేయాలని ఆంక్షలు పెడుతూ కేంద్ర ప్రభుత్వం వారి హక్కులను కాలరాస్తుందని వాపోయారు. పతి ఏటా వేల సంఖ్యలో మహిళలు పిల్లలు అక్రమ రవాణాకు గురవుతున్నారని, ప్రగతిశీల మహిళా సంఘం వీటన్నిటిని ప్రతిఘటిస్తూ తమ హక్కుల కొరకు ఉద్యమించాలని పిలుపునిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్ట రాజన్న,సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, బక్కన్న,రాం లక్ష్మ ణ్ యునియన్ జిల్లా నాయకురాలు గోదావరి,బీడీ కార్మికులు ఉష తాయ్, మనీషా, అనురాధ, శివకాంత, ప్రేమల, రజిత శబాన తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలి

### నడిపెల్లి విజిత్ కుమార్

**ప్రజాపక్షం / దండేపల్లి :** రైతులకు ప్రభుత్వం బకాయి ఉన్న మూడు విడతల రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్ డిమాండ్ చేశారు. మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు అధ్యక్షతన శనివారం దండేపల్లి మండల కేంద్రంలో రైతులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజిత్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో కేవలం మూడు ఎకరాల లోపు ఉన్న రైతులకు మాత్రమే నిధులు ఇచ్చి, మిగిలిన వారికి అన్యాయం చేసిందని మండిపడ్డారు. రైతుల సంక్షేమం కోసం బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని, వారికి అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, దండేపల్లి మాజీ వైస్ ఎంపిపి అనిల్, లక్సెట్టిపేట మాజీ డిసిఎంఎస్ చైర్మన్లు కేతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తిప్పని లింగయ్య, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళల పట్ల వివక్ష వీడాలి

### ఎఐటియుసి,ఎన్ఎఫ్ఐడబ్ల్యు పిలుపు




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నిర్మల్ జిల్లా ఎఐటియుసి కార్యాలయంలో వనమాల అధ్యక్షతన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ పి.పద్మకుమారి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజంలో మహిళల పట్ల చూపుతున్న వివక్షను తక్షణమే వీడాలని ఆమె డిమాండ్ చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పనులు చేస్తున్న మహిళలకు, పురుషులతో సమానంగా వేతనాలు అందించాలని ఆమె పేర్కొన్నారు. మహిళలు తమ సమస్యలపై ధైర్యంగా పోరాడాలని, నేటి కాలంలో అన్ని రంగాల్లో మహిళలు పురుషులకు ధీటుగా రాణిస్తున్నారని పద్మకుమారి కొనియాడారు. మహిళా సమస్యల పరిష్కారం కోసం ఎఐటియుసి,ఎన్ఎఫ్ఐడబ్ల్యు నిరంతరం పోరాటాలు చేస్తున్నాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి, ఎన్ఎఫ్ఐడబ్ల్యు నాయకులు రమాదేవి, కె.రాణి, పద్మావతి, జయంతి మాల, గొప్పమ్మ, నళిని, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శక పాలనకు సామాజిక తనిఖీలే కీలకం



**ప్రజాపక్షం / తిర్యాణి :** గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, పథకాల అమలులో పారదర్శకతను పెంచేందుకు సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) ఎంతగానో దోహదపడుతుందని సర్పంచ్ కోవ దీవింద్రబాయ్ తెలిపారు. తిర్యాణి మండలం భీంజిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని బుగ్గగూడ గ్రామంలో శనివారం సామాజిక తనిఖీ గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ ఆడిట్ బృందం గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులు, కూలీలకు చెల్లించిన వేతనాలు, పనుల నాణ్యతపై గ్రామస్థుల సమక్షంలో సమీక్ష జరిపింది. ప్రభుత్వం చేపడుతున్న పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్నాయా లేదా అన్నది ఈ సభల ద్వారా స్పష్టమవుతుందని సర్పంచ్ పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లోటుపాట్లు ఉంటే సరిదిద్ది తదుపరి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సభలో కోవ చిన్నరాజు, ఉపసర్పంచ్ కోవ లక్ష్మి , ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పటేలు, ఉపాధి హామీ కూలీలు, సోషల్ ఆడిట్ తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

## పాఠశాలల అభివృద్ధికి.. ఉపాధ్యాయులు కృషి చేయాలి

**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం సముదాయ పాఠశాల పరిధిలోని పాఠశాలల అభివృద్ధి, 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలుపై శనివారం జన్నారం బాలుర ఆశ్రమ పాఠశాలలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఎం. శివరాజం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు, పాఠశాలల అవసరాలు, నిధుల వినియోగంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులను సక్రమంగా వినియోగించాలని సూచించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ వారి ఉన్నతికి తోడ్పడాలని కోరారు. ఈ సమావేశంలో రఘునాథం, బి. రాజారం, సముదాయ పరిధిలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సైన్స్‌తో అద్భుతాలు..



ప్రజాపక్షం/ఖానాపూర్ : ఖానాపూర్ మండలం సత్తెనపల్లి జడ్పిఎస్ఎస్ పాఠశాలలో శనివారం సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. జాతీయ సైన్స్‌డే లో భాగంగా ఎస్ఎస్ఎఫ్ సభ్యులు బొమ్మెన రాజ్ కుమార్ విద్యార్థులకు సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రస్తుత డిజిటల్ రంగంలో ఎన్నో సైన్స్ అద్భుతాలు ఆవిష్కృతమవుతున్నాయని అన్నారు. విద్యార్థులు మూఢనమ్మకాలను వీడాలని కోరారు. మారుతున్న పరిస్థితుల పట్ల విచక్షణతో ఆలోచించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్యాం నాయక్ తీరుపై సర్పంచుల రణభేరి



ప్రజాపక్షం / తిర్యాణి : తిర్యాణి మండల కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. జిల్లా కాంగ్రెస్ ఇన్చార్జి శ్యాం నాయక్ పార్టీలో చిచ్చు పెడుతున్నారని, ఆయన తన వైఖరి మార్చుకోకపోతే సహించేది లేదని తిర్యాణి సర్పంచ్ మడావి రాజేష్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీకి నిరంతరం అండగా నిలుస్తున్న అనిల్ గౌడ్‌ను సస్పెండ్ చేయడం తగదని, ఆయనకు మద్దతుగా మండలంలోని 17 మంది సర్పంచులు ఏకతాటిపై ఉన్నారని స్పష్టం చేశారు. ఈ వివాదంపై త్వరలోనే గాంధీ భవన్‌కు వెళ్లి పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. శ్యాం నాయక్ ఒంటెద్దు పోకడలు కొనసాగిస్తే 17 మంది సర్పంచులం మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధమని తెగేసి చెప్పారు. పార్టీ శ్రేణుల మధ్య విభేదాలు సృష్టిస్తున్న నాయకులపై అధిష్ఠానం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వధూవరులకు కాంగ్రెస్ నేతల ఆశీర్వాదం

ప్రజాపక్షం/ముత్తారం : ముత్తారం మండల కేంద్రంలోని వెంకటలక్ష్మి గార్డెన్స్‌లో ఎర్ర మొగిలి ఓదెమ్మ కుమారుడు వెంకటేష్ రమ వివాహానికి ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, సర్పంచ్ బొంతల అన్నపూర్ణ ఉపేందర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు ముగా రవీందర్, అకోజు అశోక్ చారి, సీనియర్ నాయకులు సంపూర్ణ చారి, రాం రాజయ్య, స్వామి, మహేందర్, వెంకటేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు

## పంచాయతీ కార్మికుల వేతనాలు ఖాతాల్లో జమ చేయాలి

### సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు గణపతి రెడ్డి



ప్రజాపక్షం / కౌటాల : పంచాయతీ కార్మికుల వేతనాలను గ్రామ పంచాయతీల ద్వారా కాకుండా ప్రభుత్వమే నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేయాలని సిఐటియు అనుబంధ పంచాయతీ రాజ్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మార్చి 4న రాష్ట్ర అధ్యక్షుడు గణపతి రెడ్డి అధ్యక్షతన జరిగిన ఆన్‌లైన్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం ముందు కార్మికులు నిరసన చేపట్టారు. పంచాయతీ కార్మికుల వేతనాల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, మార్చి 2న ప్రభుత్వం జారీ చేసిన మెమోను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఉద్యమాలు చేపట్టనున్నట్లు యూనియన్ నేతలు ప్రకటించారు. ఇందులో భాగంగా మార్చి 12 నుంచి 14 వరకు జిల్లాల వారీగా ఎమ్మెల్యేల కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించి వినతిపత్రాలు అందజేయనున్నారు. అనంతరం మార్చి 17న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని, 2025 సభ్యత్వ నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ పథకం లబ్ధిదారులకు అవగాహన




ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం లబ్ధిదారులకు శనివారం,పట్టణంలోని హోటల్ మారుతి ఇన్ లో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ,ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం గురించి వివరాలను లబ్దిదారులకు తెలిపారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రుణాల పథకాలు అన్నిటిని అర్హులైన వారు సద్వినియోగపరుచుకొని ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల ఉన్నతికి ఎన్నో రకాలైన పథకాలను అమలుపరుస్తున్నాయని అన్నారు.పేద ప్రజలు, చిన్న,మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు చేసుకొని వ్యాపారంలో ఎదిగేలా ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని చెప్పారు.ఈ పథకాల ద్వారా లబ్ధిదారులు ఉపాధి పొందడమే కాకుండా,ఇతరులకు ఉపాధి కల్పించేలా ఎదుగుతారని తెలిపారు.ప్రభుత్వాలు అందించే పథకాలకు సంబంధించి అవసరమైన మెలుకువలు నేర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహా రెడ్డి,ఎల్డీఎం రామ్ గోపాల్,ఇండియన్ పోస్ట్స్ మేనేజర్ వీరస్వామి,పోస్టల్ ఇన్స్పెక్టర్ రాజేంద్ర యాదవ్,స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం మేనేజర్ దినేష్ కుమార్,ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త రకం వంగడాలతోనే అధిక లాభాలు

### మండల వ్యవసాయ శాఖ అధికారి అంజిత్ కుమార్



ప్రజాపక్షం / జన్నారం : రైతులు సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా కొత్త రకం వంగడాలను సాగు చేసి అధిక లాభాలు గడించాలని జన్నారం మండల వ్యవసాయ శాఖ అధికారి అంజిత్ కుమార్ సూచించారు. జన్నారం మండలంలో ఆత్మ (అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ) ఆధ్వర్యంలో శనివారం చింతగూడ రైతు వేదికలో రైతులకు అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పులను తట్టుకుని నిలబడే వంగడాల ఎంపికపై రైతులకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి గిరాకీ ఉన్న వరి రకాలైన జెజిఎల్27356, ఆర్ఎన్ఆర్31479, కెఎన్ఎమ్7715 వంటి రకాలు చీడపీడలను సమర్థవంతంగా తట్టుకుంటాయని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని ఇస్తాయని వివరించారు. మొక్కజొన్న సాగులో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని, తద్వారా నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని తెలిపారు. రైతులు పంటల మార్పిడి చేస్తూ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని కోరారు. అనంతరం రైతులు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏఇఓలు, మండలంలోని పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## కాల్వ పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు

### మహిళా ప్రజాప్రతినిధులు.. ఉపాధ్యాయులకు సన్మానం



ప్రజాపక్షం/దిలావర్ పూర్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కాల్వ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మహిళా శక్తిని చాటేలా వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు,మండల పంచాయతీ అధికారి(ఎం.ఇ.ఒ.), ఉప సర్పంచ్, ఉపాధ్యాయ బృందం, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో విద్యార్థినిలతో కలిసి గ్రామ సర్పంచ్,అలాగే పాఠశాల మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర అద్వితీయమని, ప్రతి రంగంలోనూ మహిళలు రాణిస్తుండటం గర్వకారణమని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న మండల స్థాయి అధికారులు, గ్రామ నేతలు మాట్లాడుతూ, మహిళలకు గౌరవం ఇవ్వడం మన సంప్రదాయమని, విద్యార్థి దశ నుంచే బాలికలు ఉన్నత లక్ష్యాలతో చదువుకుని సమాజంలో గొప్ప స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో పాఠశాల సిబ్బంది,విద్యార్థినిలు,గ్రామ పంచాయతీ ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పారిశుధ్యంతోనే.. ఆరోగ్యవంతమైన సమాజం




ప్రజాపక్షం / రెబ్బన : గ్రామ అభివృద్ధి, ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా రెబ్బన మండలంలోని రోళ్లపహాడ్ గ్రామ పంచాయతీలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. శనివారం రెండో రోజు కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిగా శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించిన సర్పంచ్ అనుముల రాజేష్ పాఠశాల పరిసరాల్లో పిచ్చిమొక్కలను తొలగించి, బ్లీచింగ్ చల్లించి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించారు. చిన్నారులు చదువుకునే చోట అపరిశుభ్రత ఉంటే వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున విద్యాసంస్థల శుభ్రతకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన తెలిపారు. గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు, విద్యాశాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దగలమని సర్పంచ్ పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ సేవా కార్యక్రమంలో ఉప సర్పంచ్ మడే కుమార్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యుడు రెబ్బన నరేష్, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు



ప్రజాపక్షం / పెంచికల్‌పేట్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని పిఆర్‌టియుటిఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు సూచించారు. పెంచికల్‌పేట్ మండలంలోని చెడ్వాయి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల మధ్య మూడు రోజుల వ్యవధి ఉన్నందున, ప్రతి సబ్జెక్టుకు తగిన సమయం కేటాయించి ప్రణాళికాబద్ధంగా చదవాలని, మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పిఆర్‌టియుటిఎస్ మండల శాఖ తరఫున గుండు యాదగిరి, చౌదరి వెంకటేష్ విద్యార్థులకు స్కేలు, పెన్సిల్, పెన్ వంటి విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట రమేష్, చౌదరి వెంకటేష్, తంగడపల్లి రాకేష్, భిక్షపతి, రిటైర్డ్ ఉపాధ్యాయులు రవికుమార్, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సమాజ అభివృద్ధిలో.. మహిళల పాత్ర అమూల్యం

ప్రజాపక్షం / కాసిపేట : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని కాసిపేట ప్రెస్ క్లబ్ ప్రతినిధులు కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలో వివిధ శాఖల్లో ప్రతిభ కనబరిచిన ఉత్తమ మహిళా ఉద్యోగులను ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహిళలు వృత్తి బాధ్యతల్లో ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఉత్తమ ఉద్యోగులుగా దేవరపల్లి పుష్పలత (విద్య), మాడ దివ్య (వైద్యం), దుర్గం జయ (రెవెన్యూ), పెద్ది అన్నపూర్ణ (పంచాయతీ రాజ్), అజ్మీర రమాదేవి (పోలీస్)లను ఎంపిక చేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సత్యనారాయణ సింగ్, డిప్యూటీ తహసీల్దార్ నాగుల అంజయ్య, ఎంఇఓ వెంకటేశ్వర స్వామి, ఎంపిఓ షేక్ సఫ్దర్ అలీ, సూపరింటెండెంట్ లక్ష్మయ్య, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీ నారాయణ, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కంటం తిరుపతి, గౌరవాధ్యక్షుడు చెట్టి శ్రీధర్, జనరల్ సెక్రటరీ రాజేష్, కోశాధికారి లద్దూరి రమేష్, సలహాదారులు రవిరాజ్, సయ్యద్ నజీర్ హుస్సేన్, సురేష్ పాల్గొన్నారు.

# గ్రామ సభలో పాల్గొన్న అదనపు కలెక్టర్



ప్రజాపక్షం/మల్యాల : జగిత్యాల మల్యాల మండలం ముత్యం పేట గ్రామంలో శని వారం గ్రామ సభ ఏర్పాటు చేశారు. దిగువ కొండగట్టు గౌడ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సభ కు జిల్లా అదనపు కలెక్టరు బి య స్ లత పాల్గొన్నారు. జాతీయ రహదారి 563 నంబర్ రోడ్డు విస్తరణ భూసేకరణ లో ముత్యంపేట రెవెన్యూ పరిధిలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితుల సందేహాలు, సమస్యలను నివృత్తి చేశారు. ఈ గ్రామస భలో గ్రామ సర్పంచ్ దారం ఆదిరెడ్డి, తహసి ల్దార్ వసంత, రెవిన్యూ ఇన్స్పెక్టర్ తిరుపతి, జీపీవో స్వామి, రైతులు పాల్గొన్నారు.

## గద్దర్ అవార్డు ఉత్తమ నటుడిగా అక్కినేని నాగచైతన్య



ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగి త్యాల జిల్లా కేంద్రంలోని అక్కినేని అభిమా నులు ఆనందం నెలకొంది. నేడు ప్రకటిం చిన తెలంగాణ రాష్ట్ర గద్దర్ 2025 అవా ర్డులో భాగంగా ప్రముఖ సినీ నటుడు అక్కి నేని నాగచైతన్య ఉత్తమ సినీ నటుడిగా ఎంపిక కావడం అభిమానుల్లో ఆనందాన్ని నెలకొంది ఫుండేల్ చిత్రంతో ఆయన చేసిన అద్భుత నటనకు ఈ గౌరవం లభించడం పట్ల అభిమానులు హర్షం వ్యక్తం చేస్తు న్నారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా అధ్యక్షుడు నల్ల సురేష్ ఉపాధ్యక్షుడు సామ్యూల్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వ హించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రవి, రాజేష్, సాగర్, అభినయ్ థియేటర్ యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల ఎంపిడిఒకు ఇబ్రహీంపట్నం ఎంపిడిఒగా అదనపు బాధ్యతలు




ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిష త్ కార్యాలయంలో సోమవారం ఇబ్రహీంప ట్నం ఎంపీడీవో గా అదనపు బాధ్యతలను కోరుట్ల ఎంపిడిఓ ఓదెల రామకృష్ణ సోమవా రం బాధ్యతలను చేపట్టారు. ప్రస్తుత ఎంపిడి ఒ చిప్ప గణేష్ 45 రోజుల శిక్షణకు వెళ్లిన నేపథ్యంలో ఆయన ఈ బాధ్యతలు తీసుకు న్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బ ంది ఎంపీడీవో రామకృష్ణను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కా ర్యక్రమంలో సీనియర్ సహాయకుడు లక్ష్మ య్య, శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : మొక్కజొన్నకు సరైన ధర లభించేలా గ్రామంలో మార్క్ఫెడ్ ఆధ్వ ర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని జగిత్యాల జిల్లా రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో రైతులు శనివారం తహసీల్దార్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఇందిరా గాంధీ చౌరస్తా వద్ద నుండి జిల్లా రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు నల్ల రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు నాయకులు, రైతులు ర్యాలీగా తహసిల్దార్ కార్యాలయం వద్దకు బయలుదేరి తహసిల్దార్ బి.ఎస్.ఎస్ వరప్రసాద్ కు వినతిపత్రం అందజే శారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ మొక్కజొన్న పంట కోత ప్రారంభమైన నేపథ్యంలో మధ్య వర్తుల చేతిలో రై తులు నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం మొక్కజొ న్న పంట క్వింటాలుకు మద్దతు ధర 2400 ప్రకటించి కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఖరీఫ్ లో అమ్మిన మొక్క జొన్న పంటకు సంబంధించి 6వేల, ఎకరాలకు సంబం ధించి 300 రైతులకు డబ్బులు జమ కాలేదని వాటిని రైతుల ఖాతాలో వెంటనే జమ చేయాలని, రైతు భరోసా నిధులను కూడా వెంటనే విడుదల కోరుతూ రైతుల సమ స్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సత్వరమే పరిష్కరించా లని తహసిల్దార్ కు వి జ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు బద్దం గో పి, బాయి లింగారెడ్డి, గుజ్జుల రమేష్, జిల్లాల పవన్, శ్రీధర్ రెడ్డి, రైతులు ఏలేటి పెద్ద రెడ్డి, పడాల రాజేందర్, అమృత రాజ్, అనంత్ రెడ్డి, తీగల రమేష్, రైతులు పాల్గొన్నారు.

## కోరుట్ల ఏరియా ఆసుపత్రిలోస్వచ్ఛ తెలంగాణ స్వచ్ఛ భారత్



ప్రజాపక్షం/కోరుట్ల : స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్ర మంలో భాగంగా కోరుట్ల ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో గౌతమ్ హైస్కూల్ NCC విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు కల్పించడం జరిగింది. కోరుట్ల ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీత రాణి మాట్లాడుతూ పరి శుభ్రమైన పరిసరాలు మంచి ఆరోగ్యానికి మూలమని తెలి పారు.ప్రతి ఒక్కరు తమ ఇల్లు పాఠశాల చుట్టుపక్కల ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెత్తను ఎక్కడప డితే అక్కడ వేయకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం చెత్త డబ్బాల్లో వేయాలని అన్నారు. అలాగే ప్లాస్టిక్ విని యోగం తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవ చ్చని తెలిపారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత పై అలాగే చేతులు తరచుగా కడుక్కోవడం పరిశుభ్రమైన నీళ్లు తాగడం ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వంటి అలవాట్లు పాటించడం ద్వారా అనేక వ్యాధులు నివారిం చవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్వచ్ఛభారత్ లక్ష్యాలను సాధించేందుకు తమ వంతు బాధ్యతగా పరిశుభ్రతను పాటిస్తామని స్వచ్ఛ తెలంగాణ స్వచ్ఛ భారత్ అనే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గౌతమ్ హై స్కూల్ విద్యార్థులు ఆసుపత్రికి విచ్చేసి ఆసుపత్రిలో ఉన్న చెత్త చదరాన్ని NCC విద్యార్థులు శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఏరియా ఆసుపత్రి సూపరింటెం డెంట్ డా.సునీత రాణి ఆర్ఎంఒ డా.వినోద్ ఇన్ఫెక్షన్ కంట్రోల్ ఆఫీసర్ డా.రమేష్ శానిటేషన్ సూపర్వైజర్ మర్రి సంతోష్ ఐ సి ఎన్ సురేందర్, జ్యోతిర్మయి గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ గోపి, కిజార్, క్రిస్టినా, విజయ నాయక్ స్కూల్ విద్యార్థులు ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు

డాక్టర్ మధుశ్రీ గైనకాలజిస్ట్




ప్రజాపక్షం/కోరుట్ల : కోరుట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వ హించారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన మమత హాస్పిటల్ డాక్టర్ మధుశ్రీ గైనకాలజిస్ట్ మాట్లాడుతూ స్త్రీ పవిత్రత, ప్రేమ, సహనం మరియు శక్తికి స్వరూపం. సృష్టికర్తను సృష్టించిన అమ్మగా,కుటుంబానికి వెన్నెముకగా ఉంటూ, సమాజ పురోగతిలో కీలక పాత్ర పోషిస్తుంది. సావిత్రి, సీత వంటి పవిత్ర మూర్తులుగా, నేడు అన్ని రంగాల్లో పురుష లతో సమానంగా దూసుకుపోతూ, సంస్కృతిని, దేశ ఖ్యాతిని కాపాడుతూ స్త్రీ అత్యంత గొప్పతనాన్ని చాటుకుం టోంది. నేటి సమాజంలో స్త్రీల పైన జరుగుతున్న సంఘట నపై ప్రసంగించారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సందీప్ మాట్లాడుతూ స్త్రీలు గొప్ప వ్యక్తులని స్త్రీలు లేకుంటే సమాజ నిర్మాణం జరగదని స్త్రీల యొక్కగొప్పదనాన్ని వివ రించారు. మహిళా సాధికార విభాగ సభ్యులు ఈ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఇందులో అధ్యాపక ఆధ్యాపకేతర విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో కీలకం



ప్రజాపక్షం/మెట్పల్లి : మహిళల సేవలు సమాజానికి ఎంతో విలువైన వని, వాటిని వెలకట్టలేమని మెట్పల్లి మున్సిపల్ చైర్పర్సన్ మైలారపు లింబాద్రి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణా ళిక కార్యక్రమంలో భాగంగా అంతర్జా తీయ మహిళా దినోత్సవాన్ని పురస్క రించుకుని శనివారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థిగా హాజరైన చైర్పర్సన్ మైలారపు లింబాద్రి పట్టణ పరిశు భ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య మహిళా కార్మికులను,అలాగే మున్సిపల్ కార్యాలయంలో పనిచే స్తున్న మహిళా అధికారులను శాలువాలతో ఘనంగా సన్మా నించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, కౌన్సిలర్ అజయ్, మేనేజర్ శ్రీమతి వెంకటలక్ష్మి, డి.ఈ. నాగేశ్వరరావు, జేఏఓ రమేష్, సీనియర్ అకౌంటెంట్ చైతన్య, ఆర్వో అజ్మతుల్లా బేగ్, ఆర్.ఐ.శ్రీధర్, సానిటరీ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, నిజాం, అశోక్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించే ప్ర త్యేక వైద్య శిబిరాన్ని ఇబ్రహీంపట్నం మండల కేంద్రంతో పాటు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు వనజ సూచించారు. ఈ వైద్య శిబిరంలో ఉద యం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు స్పెషలిస్ట్ డాక్టర్లు సేవలు అందిస్తారు. గైనకాలజిస్ట్, పిల్లల వైద్యులు, ఎముకల వైద్యులు, దంత వైద్యులు, కంటి వైద్యులు, జనరల్ ఫిజీషియన్ వై ద్యులు వైద్య సేవలను అందిస్తారు. మండల ప్రజలు ఈ అవకాశా న్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యు రాలు తెలిపారు.

## గొల్లపల్లిలో పోచమ్మబోనాలు



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : పోచమ్మతల్లి గ్రామంలో ఉన్న పిల్లపాప లు అందరిని చల్లంగా చూడాలని పోచమ్మతల్లికి గొల్లపల్లి లో బోనా లు తీశారు. శనివారం పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించి మహిళ లు బోనమెత్తారు..ఈ సందర్భంగా గోగూరి శ్రీనివాస్ బోనంపై గీ యించిన సీఎం బొమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.వందల సం ఖ్యలో గ్రామస్తులు పాల్గొనగా మహిళలు పోచమ్మకు ఒడిబియ్యం పోశారు. పోచమ్మ బంగారుతల్లిగా వర్ధిస్తూ ప్రతి ఏటా నిర్వహిస్తా మని భక్తులు అన్నారు. తెలంగాణ సంస్కృతిని చాటే విధంగా బో నాల జాతరను తెలుగుసమాజం చేసుకోవడం గర్వంగా ఉందని మ హిళలు అన్నారు.జోగినిలు,శివసత్తులు,వివిధ వేషధారణలతో అంద రిని అలరించే విధంగా పోచమ్మబోనాల పండుగ మహోత్సవం ఘనంగా జరిపారు.కార్యక్రమంలో గ్రామస్తులు,ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్దెత్తున పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కటారి



ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రా నికి చెందిన చెవులమద్ది రాజయ్య ఇటీవల అనారోగ్యంతో బాధప డుతూ మృతి చెందాడు .ఈ విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ, మాజీ ఎంపీపీ,మాజీ సింగిల్ విండో చైర్మన్, మాజీ గ్రంథాలయ చైర్మన్, జిల్లా సీనియర్ నాయకులు కటారి చంద్రశేఖర్ రావు శని వారం రోజు తమ నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించి ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయంగా అందజేశారు.కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అన్ని విధాలుగా తమ సహాయ సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్ర మంలో నక్క విజయ్, చెవులమద్ది హన్మండ్లు, కిష్టంపేట రమేష్ రెడ్డి, నల్ల నరసింహ రెడ్డి, చిర్ర దిలీప్, చెవులమద్ది మల్లేశ్, చెవులమద్ది సంతోష్, చెవులమద్ది విక్రమ్, చెవులమద్ది గంగాధర్, పల్లె నల్ల గొండం, చెవులమద్ది గంగమల్లు, చెవులమద్ది పోచయ్య, చుక్కయ్య, రాజలింగు, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పెన్నుల పంపిణీ

ప్రజాపక్షం/చొప్పదండి : చొప్పదండి పట్టణంతో పాటు మండలం లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలోని పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు తెలంగాణ శ్రీనివాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో పోట్ల రోకు గన్ను స్టూడెంట్కు పెన్ను అనే నినాదంతో విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను పబ్లిక్ పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొని ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో మండల శ్రీనివాసేల సమితి సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.